

కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



నెల నెలకీ కొన్ని కులాసా కబుర్లు

టైం మిషన్

"టోటల్లీ కిల్లర్" అనే సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో చూసాను. అది ఓ సీరియల్ కిల్లర్ కథ. కానీ అందులో ఓ ఇంట్రెస్టింగ్ సంగతి నన్ను అక్కడే ఆపేసింది. ఆ అమ్మాయి తన తల్లి మరణం ఆపడానికి, టైం మిషిన్‌లో 1980కి వెళ్ళిపోతుంది. అక్కడ తన తల్లీ, ఆమె స్నేహితురాళ్ళూ కాలేజీ అమ్మాయిల్లా యంగ్‌గా వుంటారు. ఆ టైమ్ లో ఆమె మాస్క్‌తో హత్యలు చేస్తున్న సీరియల్ కిల్లర్ బ్లడ్ తీసుకొచ్చి పోలీసులకి ఇచ్చి "వీడే హంతకుడు, వీడి డి.ఎన్ ఏ పరీక్ష చెయ్యండి" అంటే, డి.ఎన్.ఏ? అని పోలీస్‌లు ఆశ్చర్యంగా చుస్తారు.

"నెట్‌లో సెర్చ్ చెయ్యండి " అంటే, "నెట్?" అని మళ్ళీ నవ్వుతారు.

ఆ అమ్మాయికి అవన్నీ లేకుండా 1980లో మనుషులు ఎలా బతికారా? అనిపిస్తుంది.

నాకూ ఆ సినిమా చూస్తుంటే, నా చదువుకునే రోజుల్లో ఇవి ఏవీ లేవా? అసలు సెల్‌ఫోన్ లేకుండా, కమ్యూనికేషన్ ఎలా చేసుకునే వాళ్ళం అని ఆశ్చర్యంగా గతంలోకి తొంగి చూసాను.

మాకు ఏ విషయం తెలియాలన్నా గ్రంధాలయాలని ఆశ్రయించే వాళ్ళం. లేదా న్యూస్ పేపర్‌ని క్షుణ్ణంగా చదివేవాళ్ళం. వార్తలు కూడా రోజుకి ఒక్కసారి 24 గంటలో జరిగిన విషయాలు తెలియచేసేవి. ఇలా రోజంతా ప్రతి నిమిషం జరిగిపోతున్న హత్యలూ, మానభంగాలూ, మారణహోమాలూ గురించి, చెత్త ఛానెల్స్ "బ్రేకింగ్ న్యూస్" అంటూ ప్రాణాలు తీసేవారు కారు.

రాత్రి ఒకసారి వార్తలు. పొద్దుటే పేపర్లో వార్తలు. ఫస్ట్ పేజీలో ఆరాముగా ప్రధాన పర్యటనలూ, ఇతర దేశాలతో చేసుకున్న ఒప్పందాలూ..లాంటివి. లోపల బాక్స్‌లో ఎక్కడో ఒకటి రెండు దొంగతనం కేసులూ, హత్యవార్తలూ, అబిట్యూరీలూ వుండేవి.

అప్పట్లో ఆబిట్యురీ కాలమ్స్ కి క్రైస్తవులే ఎక్కువ ఇచ్చేవారు. సోమరాజు సుశీల గారి కథల్లో వారి అత్తగారు అవన్నీ చూసి, పీటర్ జీవరత్నం గారి మృతీ, ప్రభుదేవధానం గారి నిర్యాణం, దయామణీ జోసెఫ్‌గారి కుటుంబానికి సంతాపం... ఇలా చదివి, "పాపం ఇంతమంది క్రైస్తవులు మాత్రమే ఎందుకు చనిపోతున్నారే?" అని అడిగారుట. నాకూ ఈ అనుమానం కలిగేది అప్పట్లో.

అమెరికా ఇప్పుడు, చిక్కడపల్లి నుండి పాతబస్తీకి వెళ్ళొచ్చినట్లు వెళ్ళొస్తున్నాం కానీ అప్పట్లో, అమెరికా కానీ ఆస్ట్రేలియాకానీ విమానం ఎక్కి వెళ్ళొచ్చారంటే చాలా గొప్ప. పేపర్లో వేసుకునేవారు "పాల్ ప్రేమ్ సాగర్‌గారి స్వదేశీ ఆగమనానికి అభినందనలు" అని లేదా "అమెరికా పర్యటనకి వెళ్తున్న రామరాజుగారికి శుభాకాంక్షలు" అని.

నిజమే మా కుటుంబాలలో మొదటగా అమెరికాకి ఎం.ఎస్ చెయ్యడానికి 90లలో వచ్చి. మా అక్కయ్య కూతుళ్ళు కూడా, ఫోన్ కోసం కష్టపడి, తల్లితండ్రులకి, క్షేమంగా చేరానని చెప్పడానికి వారం రోజులు పట్టేది.

కాలింగ్ కార్డ్ అని కొనుక్కుని ఇండియాకి ఆ కార్డ్ అయ్యేదాకా మాట్లాడేవారు.

మా పిల్లలు వెళ్ళిన 2011లో కూడా మేజిక్ జాక్ అనే పరికరం కొనుక్కొచ్చి, అమెరికా నుండి, అది సిస్టంకి అమర్చుకుని పి.సి నుండి మాట్లాడేవాళ్ళం. అప్పుడు స్మార్ట్ ఫోన్ లేదు.

మళ్ళీ సినిమా విషయానికొస్తే, ఇన్ని క్రైమ్స్, స్మార్ట్ ఫోన్‌లూ, ఎప్పటి కప్పుడు వేడివేడి వార్తలూ, 'శవాల మీద పేలాలు' ఏరుకునే ఛానెల్స్ వచ్చాకా జరుగుతున్నాయా? అప్పట్లో జరిగేవి కావా? లేక తెలిసేవి కావా అన్న అనుమానం కలుగుతోంది.

మొన్నటికి మొన్న ఒక అమ్మాయి ఎంగేజ్‌మెంట్ అయ్యాకా, ఫియాన్సీని తన ప్రియుడితో కలిసి లోయలోకి తోసేసి చంపేసింది. ఆ అమ్మాయి పేరు సియా! అంటే నార్త్ ఇండియాలో 'సీత' అని అర్థం. ఈ సీత అదే సియా, అంతకుముందు హనీమూన్‌కి తీసుకెళ్ళి, ప్రియుడి చేత భర్త రఘు వంశీని చంపించిన సోనం ఏ విధంగా హత్య చేసిందో, ఆ వివరాలూ, ఆమె చేసిన పొరపాట్లూ, నెట్‌లో క్షుణ్ణంగా చదివి, చూసి, తను అలా చెయ్యకుండా జాగ్రత్తలు తీసుకుందిట. అంతేకాదు ఆ సోనంకే ఇంకా శిక్ష పడలేదు. పోలీసులు రాసిన సెక్షన్లు తప్పు కాబట్టి 'నిక్షేపంగా బెయిలు మీద బయటికి వచ్చి హాయిగా తిరుగుతోంది.

కాబట్టి ఓ హత్య చెయ్యడం పెద్ద పనేం కాదులే. అని ఇన్సిపిరేషన్‌గా తీసుకుని ప్రియుడు ఇవన్నీ వద్దు 'లేచిపోదాం' అన్నా, అలా వద్దు కుటుంబాల పరువు పోతుంది, "ఓ చిన్న హత్య అంతే, ఏం ముంచుకుపోదు" అని ధైర్యం చెప్పి మరీ లోయలోకి తోసేసింది, లేదా తోయించేసింది. అది ఇంకా తేలలేదు.

"అదే తోసింది, కాదు వాడే తోసాడు" అని ఇంటరాగేషన్‌లో గిల్లికజ్జాలాడుకుంటున్నారు. అంతేకాదు. ఈ సియా బయటకి వచ్చి పోలీసులకీ, మీడియా వారికీ మిడిల్ ఫింగర్ చూపించింది. ఇదంతా సోషల్ మీడియాలో చర్చ అవ్వాలని ఉబలాటం. మంచికో చెడుకో తనపేరు నలుగురూ చెప్పుకోవాలనీ, ట్రోల్ అవ్వాలని ఉత్సాహం. ఇంతా చేసి ఆ పిల్లకి 21

సంవత్సరాలు. ఇంకా ముక్కుపచ్చలారలేదు అని చెప్పుకునే వయసు. ఇలా హత్య చేసేసి నిర్భయంగా 'మిడిల్ ఫింగర్' చూపిస్తోంది. ఇంత విజ్ఞానం, ఇన్ని రకాల ఎవేర్‌నెస్, నాలెడ్జీ ఇందుకు పనికి వస్తోంది.

ఒక బ్యాంక్ దోపిడీ, కానీ హత్యకానీ చేసేవాళ్ళు ఇంతకుముందు జరిగిన ఇదే టైప్ నేరాల గురించి పూర్తిగా తెలుసుకుంటారు. అందులో లూప్ హోల్స్, చిన్న చిన్న తప్పులూ, తాము చెయ్యకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అనుకుంటారు. కానీ నేరస్తుడు ఏదో ఒక ప్రూఫ్ నేర స్థలంలో వదిలి పెట్టకుండా రాడని, డిటెక్టివ్ యుగంధర్ గురించి రాసిన కొమ్మూరి సాంబశివరావుగారి డిటెక్టివ్ నవలల కాలం నుంచీ మాకు తెలుసు. వీళ్ళకి తెలీదు అదేమిటో.

అసలు మా చిన్నతనంలో అలాంటి సాహిత్యం చదివేవాళ్ళం కాము. వయసు వచ్చాక బుక్‌షాప్స్ నుండి రెంట్‌కి పుస్తకాలు తెచ్చుకుని చదివేవాళ్ళం. అసలు హత్యలు చేసేవాళ్ళు సినిమాలలో నెల్లూరి కాంతారావ్ లాగానో, కత్తుల రత్తయ్యలో ఎస్.వీ.ఆర్ లాగానో ప్రత్యేకంగా వుంటారేమో అనుకునేవాళ్ళం 'బిల్లా రంగా' హత్యకేసు విన్నాక, అమ్మలు పిల్లల్ని ఎక్కడికీ ఒంటరిగా పంపడానికి ఇష్టపడలేదు అప్పట్లో. అంత భయంకరమైన హత్యలు అప్పుడు కొత్త. లేదా ప్రజలకి తెలిసేవి కావు.

తరువాత తరువాత ఆదివారం అనుబంధం అనీ, సెంటర్ స్ప్రెడ్ అనీ కొన్ని పత్రికల్లో ఈ విధమైన న్యూస్ కథనాలు కళ్లకి కట్టినట్టు రాస్తే చదివేవాళ్ళం. అంతే. టీవీ వచ్చిన కొత్తల్లో కూడా ఆహ్లాదకరమైన నేషనల్ డీడీలో నవ్వొచ్చే "అడోస్ పడోస్", "ఏ జో హై జిందగీ" లాంటివీ, రాత్రిపూట ఇంగ్లీష్ ఇంప్రూవ్ అవడానికి ఇంగ్లీష్ వార్తలూ, హిందీ వార్తలూ సల్మా సుల్తానా, మినీల చీరలు చూడ్డానికీ ఉపయోగపడేవి. ఇలా క్రైమ్ స్టోరీలు గ్లోరిఫై చేసి చూపెట్టేవాళ్ళు కారు.

ఫోన్‌లు అనేవి ఆరోజుల్లో గగన కుసుమాలు. డాక్టర్లకీ, ఏక్టర్లకీ, పెద్ద పదవుల్లోవారికీ వుండేవి. అందువల్ల ఇబ్బంది పడేవాళ్ళమేమో మరి. ఏ బంధువుల ఇళ్ళకో రెండు బస్సులు మారి వెళితే తాళం కప్ప వెక్కిరిస్తూ కనపడేది. అలాంటి గడ్డురోజులు ఇప్పటికీ గుర్తొస్తే నిట్టూరుస్తాం. కానీ, ఉత్తరాలూ, టెలిగ్రాములూ, అరిచి అరిచి మాట్లాడుకునే ట్రంక్ కాల్స్ రోజుల్లో కాస్త ప్రశాంతంగా గుండెల మీద చెయ్యివేసుకుని పడుకునేవాళ్ళమేమో.

ఈ స్మార్ట్ ఫోన్‌లూ, వాట్సప్‌లూ, సిగ్నల్స్ ఫోన్‌లో వచ్చాక, మనుషుల మధ్య దూరం పెరిగి, వారి చర్యలూ, మనస్తత్వాలూ దగ్గరగా కనిపిస్తున్నాయి. ఎటువంటి దాపరికాలూ లేవు. కొందరైతే 'వ్లాగర్స్' పేరుతో పబ్లిక్‌గా కాపరాలు చేస్తున్నారు. యూ ట్యూబ్ మనీ ఆపేస్తే కానీ వీళ్ళు మారరు.

వైష్ణవి అనే యూ ట్యూబర్ ని చంపేసినా, ఆమె మొగుడికి ఇప్పటిదాకా ఏం శిక్ష పడలేదు కాబట్టి, నిన్న ఒకడు ఏడుగుర్ని ఒకేసారి, అందులో అతని స్వంత పెళ్ళాం, ఇద్దరు స్వంత కొడుకులూ ఏడాదిన్నరా, నెలలవాళ్ళు కూడా వున్నారుట, చంపేసాడుట. ఇలా మన ప్రగతినీ, సాంకేతిక పరిజ్ఞానన్నీ హత్యలు చేసేవాళ్ళు హాయిగా వినియోగించుకుంటున్నారు.

ఇప్పుడొస్తున్న సినిమాలు కూడా 'వధ్', 'దృశ్యం' ఇవన్నీ సీరియల్‌గా, 'జానేజానూ', 'మోహినీ అట్టం'.. హత్య చేసి తప్పించుకోడం, పైగా ఈ హత్యల ఇన్విస్టిగేషన్ కోసం ఒక బఫూన్ లాంటి పోలీస్ ఇన్‌స్పెక్టర్ వచ్చి కామెడీ చెయ్యడం చూపిస్తున్నారు.

ఒక మాటలో చెప్పాలంటే, హత్యల్ని నార్మలైజ్ చేసేస్తున్నారు.

ఇవన్నీ వదిలేసి టైమ్ మిషన్‌లో వెనక్కి వెళితే హాయిగా నవలలు చదువుకుంటూ, పోస్ట్‌లో వచ్చిన ఉత్తరాలు చదువుకుంటూ, యూ ట్యూబ్‌లూ, ఓటీటీలూ లేవు కాబట్టి వడియాలు పెట్టుకుంటూ, డాబామీద పక్కింటావిడతో కబుర్లు చెప్పుకుంటూ, కుట్లూ అల్లికలూ, లేదా సంగీతం, మిగతా లలిత కళలూ నేర్చుకుంటూ, ఆల్‌ఇండియా రేడియోలో నాదస్వరం, లలితగీతాలూ, మధ్యాహ్నాలు కార్మికుల కార్యక్రమం వింటూ సంస్కృత వార్తలు అర్థం చేసుకుంటూ, వచ్చీ పోయే అలలులాంటి సిలోన్ స్టేషన్‌లో తెలుగు పాటలు వింటూ... ఆహా! ఎంత ప్రశాంతంగా నేలమీద కూర్చుని కుటుంబం అంతా కలిసి భోంచేసే వాళ్ళం. డాబామీద పక్కలు వేసుకుని, ఏసీలు లేకుండా చల్లగాలి అనుభవించేవాళ్లం. బ్లాక్ అండ్ వైట్ మూవీస్‌లా నెమ్మదిగా, హాయిగా బ్రతుకు గడిపేవాళ్ళం అనిపిస్తుంది.

Post your comments





